నమస్తే తెలంగాణ
మహబూబాబాద్
5 | వరంగల్, శుక్రవారం 23 మే 2025 | MAHABUBABAD





ఖానాపురంలో తడిసిన ధాన్యాన్ని మాజీ ఎమ్మెల్యే పెద్ది సుదర్శన్‌రెడ్డికి చూపిస్తున్న మహిళా రైతు

# ధాన్యం కొనుగోళ్లలో ప్రభుత్వం విఫలం

- కాంగ్రెస్ నాయకుల చెప్పులు మోసే వారికే కేంద్రాలు
- క్షేత్రస్థాయి పర్యటనలకు స్థానిక ఎమ్మెల్యే దూరం
- నర్సంపేట మాజీ ఎమ్మెల్యే పెద్ది సుదర్శన్‌రెడ్డి
- వరంగల్ జిల్లా ఖానాపురంలో తడిసిన వడ్ల పరిశీలన

ఖానాపురం, మే 22 : ధాన్యం కొనుగోళ్లలో కాంగ్రెస్ ప్రభుత్వం పూర్తిగా విఫలమైందని నర్సంపేట మాజీ ఎమ్మెల్యే పెద్ది సుదర్శన్‌రెడ్డి అన్నారు. గురువారం ఆయన స్థానిక బీఆర్‌ఎస్ నాయకులతో కలిసి ఖానాపురం మండల కేంద్రంలో ధాన్యం కొనుగోలు కేంద్రాల్లో తడిసిన వడ్లను పరిశీలించారు. ఈ సందర్భంగా రైతులు తడిసిన ధాన్యాన్ని చూపుతూ కన్నీటితో తమ గోడును పెద్దికి వివరించారు. అనంతరం పెద్ది మాట్లాడుతూ ధాన్యం కొనుగోళ్లలో ప్రభుత్వానికి చిత్తశుద్ధి లేదన్నారు. సివిల్ సప్లయ్ శాఖ మంత్రి ఉత్తమ్‌కుమార్‌రెడ్డి చెప్పే మాటలకు క్షేత్రస్థాయిలో జరిగే పనులకు సంబంధం లేకుండా ఉందన్నారు. ప్రభుత్వం చెప్పే బోగస్ మాటలకు రైతులు నరకయాతన అనుభవిస్తున్నారని మండిపడ్డారు. కొనుగోళ్లలో జాప్యంతోనే అకాల వర్షాలకు ధాన్యం తడిసి ముద్దవుతున్నదని ఆవేదన వ్యక్తం చేశారు. రైతులకు ఇంతనష్టం జరుగుతున్నా అధికార పార్టీ ఎమ్మెల్యే కానీ, స్థానిక నాయకులు కానీ కొనుగోలు కేంద్రాలను పరిశీలించకపోవడం విడ్డూరంగా ఉందన్నారు. నిర్వహణ బాధ్యత చూసే అధికారులు సైతం ఇప్పటి వరకు పరిశీలించలేదన్నారు. స్థానిక ఎమ్మెల్యేకు శుభకార్యాలకు వెళ్లడానికి సమయం ఉంటుంది కానీ, రైతులకు ధైర్యం చెప్పడానికి సమయం ఉండడం లేదా అని ఆగ్రహం వ్యక్తం చేశారు. తడిసిన ధాన్యాన్ని కొనుగోలు చేస్తామని హామీ ఇచ్చిన ప్రభుత్వం ఇప్పటి వరకు ఎక్కడా కొనుగోలు చేసిన దాఖలాలు లేవన్నారు. యాసంగిలో సన్న ధాన్యానికి రూ.936 కోట్లు విడుదల చేయాల్సి ఉండగా, ఇప్పటి వరకు రూపాయి కూడా ఇవ్వలేదని ఆరోపించారు. పైగా సన్నధాన్యానికి బస్తాకు 5కిలోల కోత పెడుతున్నారన్నారు. నియోజకవర్గవ్యాప్తంగా గతంలో 15 ఏండ్లుగా నడుస్తున్న ధాన్యం కొనుగోలు కేంద్రాలను రద్దుచేసి కాంగ్రెస్ నాయకులు వారి చెప్పులు మోసే వారికి నిబంధనలకు విరుద్ధంగా కట్టబెట్టారని మండిపడ్డారు. దీనికి జిల్లా కలెక్టర్, డీసీవో, సివిల్ సప్లయ్ డీఎం, జిల్లా వ్యవసాయాధికారి బాధ్యత వహించాలని బీఆర్‌ఎస్ పార్టీ డిమాండ్ చేస్తున్నదన్నారు. సహకార సంఘాలు, ఎఫ్‌బీవోలను నిర్వీర్యం చేసే కుట్రలు చేస్తున్నారన్నారు. వారికి చెందాల్సిన కొనుగోలు కేంద్రాల కమీషన్లను కాంగ్రెస్ నాయకుల ఖాతాల్లో జమ చేసుకుంటున్నారని ఆరోపించారు. జిల్లావ్యాప్తంగా రూ.5 కోట్లు కాంగ్రెస్ నాయకుల ఖాతాల్లోకి వెళ్తున్నాయంటే వారి దోపిడీ ఏ విధంగా ఉందో ప్రజలు అర్థం చేసుకోవాలన్నారు. మిల్లర్లతో కూడా అధికార పార్టీ నాయకులు కుమ్మక్కై కోతల్లో వాటాలు పంచుకుంటున్నారన్నారు. బీఆర్‌ఎస్ ప్రభుత్వంలో రైతులు పంటలు నష్టపోతే స్థానిక నాయకత్వం వెన్నుదన్నుగా నిలిచిందని గుర్తు చేశారు. ఆయన వెంట మాజీ ఎంపీపీ వేములపల్లి ప్రకాశ్‌రావు, బత్తిని శ్రీనివాస్‌గౌడ్, బీఆర్‌ఎస్ మండల అధ్యక్షుడు మహాలక్ష్మి వెంకటనర్సయ్య, బోడ పూలు, వేజళ్ల కిషన్‌రావు, బందారపు శ్రీను, మస్తాన్, నాగార్జునరెడ్డి ఉన్నారు.



జాతీయ రహదారిపై ఇసుక లారీలు (ఫైల్)

**ములుగు జిల్లాలో అడ్డూఅదుపు లేని వేగంతో** దూసుకొస్తున్న ఇసుక లారీలతో ప్రజల ప్రాణాలు గాల్లో కలిసిపోతున్నాయి. మద్యం మత్తు, నిర్లక్ష్యపు డ్రైవింగ్‌కు నిత్యం ఏదో ఒకచోట ప్రమాదాలతో రహదారులు రక్తమోడుతున్నాయి. ఎన్‌హెచ్-163 ఎక్కువగా విస్తరించి ఉన్న ఈ జిల్లాలో భద్రాచలం, చందుపట్ల, ఏటూరునాగారం, మణుగూరు రోడ్లపై ఉన్న మూలమలుపులకు తోడు రోడ్ల నిర్మాణ లోపాలు, నిర్వహణ లేమికి తోడు నియంత్రణ, భద్రతా చర్యలు కరువై ఎంతోమంది ప్రాణాలు కోల్పోతుండగా మరికొందరు క్షతగాత్రులుగా మారి వారి కుటుంబీకులకు తీరని దుఃఖాన్ని మిగుల్చుతోంది. ఆధ్యాత్మిక, పర్యాటకానికి నెలవైన ఈ ప్రాంతానికి తెలంగాణ నుంచే గాక వివిధ రాష్ట్రాల నుంచి వచ్చే సందర్శకులూ రోడ్డు ప్రమాదాలకు గురికావడం ఆందోళన కలిగిస్తోంది. ఇప్పటికైనా భారీ వాహనాలు, ముఖ్యంగా ఇసుక లారీల వేగానికి కళ్లెం వేయాల్సిన అవసరం ఎంతైనా ఉన్నది.

- ములుగు, మే 22(నమస్తే తెలంగాణ)

### ములుగు జిల్లాలో హడలెత్తిస్తున్న వాహనాలు

- అడ్డూఅదుపు లేని వేగంతో ఘోర ప్రమాదాలు
- ఓవర్‌స్పీడ్, డ్రంక్ అండ్ డ్రైవ్‌తోనే ఎక్కువగా..
- నిత్యం ఏదో ఒక చోట నెత్తురోడుతున్న రహదారులు
- ఆధ్యాత్మిక, పర్యాటక ప్రాంతంలో కరువైన రోడ్డు భద్రత
- అతి వేగానికి కళ్లెం వేయాలంటున్న ప్రజలు

# వామ్మో ఇసుక లారీలు.. గాల్లో ప్రాణాలు

## నియంత్రణ చర్యలు ఏవీ?

ములుగు జిల్లాలో ఇసుక లారీలు ప్రజలను హడలెత్తిస్తున్నాయి. మద్యం మత్తు, మితిమీరిన వేగం రోడ్డు ప్రమాదాలకు కారణమవుతుండగా ప్రతి రోజూ ఎక్కడో ఒక చోట ద్విచక్ర వాహనదారులు, బాటసారులు మృత్యువాతపడుతున్నారు. అయితే నిత్యం ప్రమాదాలు జరుగుతున్నా అధికారులు నియంత్రణ చర్యలు తీసుకున్న దాఖలాలు కనిపించడం లేదు. రోడ్ల విస్తరణ పనులు చేపట్టినప్పటికీ రోడ్డు భద్రతపై దృష్టి సారించకపోవడంతో ఎంతో మంది ప్రాణాలు గాలిలో కలుస్తున్నాయి. మల్లంపల్లి, ములుగు మండలాలతో పాటు గట్టమ్మ ఆలయ సమీపం, ఎర్రిగట్టమ్మ మూలమలుపు, గోవిందరావుపేట మండలం సోమలగడ్డ క్రాస్‌రోడ్డు, ఏటూరునాగారం మండలం చిన్నబోయినపల్లి, వాజేడు మండలం జగన్నాథపురం వై జంక్షన్, మంగపేట మండలం తిమ్మంపేట క్రాస్‌రోడ్డు, చుంచుపల్లి, వెంకటాపురం(నూగూరు) మండలం రామాంజాపురం, విజయపురి కాలనీ, నూగూరు వద్ద తరచూ రోడ్డు ప్రమాదాలు చోటు చేసుకుంటున్నాయి. ప్రమాదాలు జరిగిన సమయంలో అధికారులు హడావిడిగా తనిఖీలు చేస్తున్నప్పటికీ ఆ తర్వాత రక్షణ చర్యలను నిర్లక్ష్యం చేస్తున్నారు. రోడ్డు భద్రతా వారోత్సవాలప్పుడు మాత్రమే అవగాహన కల్పించి ఆ తర్వాత నిబంధనలను గాలికి వదిలేస్తున్నారు. నిర్మానుష్యంగా ఉన్న ప్రాంతంలో వేగంగా వెళ్లి టౌన్‌లలో వేగాన్ని తగ్గించాల్సిన ఇసుక లారీలు ఆయా మండలాల్లోని టౌన్‌లలో సైతం వేగాన్ని తగ్గించడం లేదు. నిత్యం ఓవర్‌స్పీడ్‌తో పాటు ప్రజలను భయభ్రాంతులకు గురిచేసేలా హారన్ సౌండ్‌లతో రయ్‌రయ్ అని దూసుకుపోతూ బీభత్సం సృష్టిస్తున్నారు.

## ఇటీవల జరిగిన రోడ్డు ప్రమాదాలు

- మల్లంపల్లి మండల కేంద్రం సమీపంలో ఫిబ్రవరి 27న వరంగల్ జిల్లా ఖానాపురం మండలం బుధరావుపేటకు చెందిన షేక్ మహబూబ్, షేక్ ఫానా దంపతులు ద్విచక్రవాహనంపై వెళ్తుండగా లారీ మృత్యువు రూపంలో దూసుకురావడంతో జరిగిన ప్రమాదంలో ఇద్దరు ప్రాణాలు కోల్పోయారు.
- ఏప్రిల్ 13న వెంకటాపురం(నూగూరు) రామాంజాపురం సమీపంలోని మూలమలుపు వద్ద రెండు ఇసుక లారీలు వేగంగా వచ్చి ఢీకొనడంతో ఇద్దరు డ్రైవర్లు తీవ్రంగా గాయపడ్డారు.
- వాజేడు మండలం ప్రగళ్లపల్లి గ్రామంలో మార్చి 30న ఆర్టీసీ బస్సును ఇసుక లారీ ఓవర్ టెక్ క్రమంలో ఎదురుగా వచ్చిన ద్విచక్ర వాహనాన్ని ఢీకొట్టడంతో ఒకరు తీవ్రంగా గాయపడ్డారు.
- గతేడాది జూలై 13న ఏటూరునాగారం మండలంలో ఎన్‌హెచ్-163పై కంటెయినర్ లారీ ఆటోను ఢీకొన్న దుర్ఘటనలో వాజేడు మండలానికి చెందిన ఐదుగురు మృత్యువాతపడ్డారు.
- వెంకటాపురం(నూగూరు) మండలం ముప్పేడు వీరాపురం గ్రామంలో మార్చి 24న చల్లూరు గోపాల్ అనే ద్విచక్ర వాహనదారుడిని ఇసుక లారీ ఢీకొట్టి సుమారు 100 మీటర్ల దూరం ఈడ్చుకొని వెళ్లింది. దీంతో అతడి శరీర భాగాలు ఛిద్రమయ్యాయి.
- వీటిని మర్చిపోకముందే గురువారం రాత్రి తాడ్వాయిలోని మేడారం దర్శనానికి ట్రాక్టర్‌లో వెళ్లి వస్తున్న భద్రాద్రి కొత్తగూడెం జిల్లా అశ్వాపురానికి చెందిన వారిని ఇసుక లారీ అతివేగంగా వచ్చి ఢీకొట్టింది. ఈ ప్రమాదంలో ఇద్దరు ప్రాణాలు కోల్పోగా మరో 18మందికి తీవ్ర గాయాలయ్యాయి. ఇప్పటికైనా స్థానిక మంత్రి సీతక్క, కలెక్టర్ దివాకర, ఎస్పీ శబరీష్, సంబంధిత శాఖ అధికారులు స్పందించి లారీల వేగాన్ని అదుపు చేయాలని జిల్లా ప్రజలు కోరుతున్నారు.



విరిగిన కాలును చూపుతున్న శంకర్

# రైతును చితకబాదిన ఎస్సై

- విచారణ చేయకుండానే దండన
- కన్నీటి పర్యంతమైన బాధిత రైతు శంకర్

పర్వతగిరి, మే 22: వ్యవసాయ భూమి గొడవలో వరంగల్ జిల్లా పర్వతగిరి ఎస్సై విచారణ చేపట్టకుండానే మరో వర్గానికి మద్దతుగా నిలిచి తనను చితకబాదినట్లు మండలంలోని ఏనుగల్లు శివారు గుగులోత్ తండాకు చెందిన రైతు మూడు శంకర్ వాపోయాడు. గురువారం ఆయన తన గోడు వెల్లబోసుకున్నాడు. గుగులోత్‌తండా పరిధిలోని మూడుతండాలో 2005లో పూల్‌సింగ్, రాజు వద్ద 1.27 ఎకరాల వ్యవసాయ భూమిని శంకర్ కొనుగోలు చేసి పట్టా చేయించుకున్నాడు. అయితే, ఈ భూమిలో నుంచి దారి కోసం తిరిగి భూమి ఇవ్వాలని శంకర్‌తో పూల్‌సింగ్, రాజు గొడవ పడుతున్నారు. రెండు రోజుల క్రితం పూల్‌సింగ్, రాజు పోలీస్‌స్టేషన్‌లో శంకర్‌పై ఫిర్యాదు చేయగా, బాధిత రైతును ఎస్సై స్టేషన్‌కు పిలిచి విచారణ లేకుండానే బూటు కాలుతో తన్ని విచక్షణా రహితంగా కొట్టాడు. దీంతో కాలు విరిగి గాయాలపాలయ్యాడు. తనకు న్యాయం చేయాలని సీపీ, ఎమ్మెల్యేకు ఫిర్యాదు చేయనున్నట్లు బాధిత రైతు తెలిపాడు.



వరంగల్ రైల్వేస్టేషన్‌లో జ్యోతి ప్రజ్వలన చేస్తున్న కేంద్ర మంత్రి భూపతిరాజు శ్రీనివాసవర్మ



త్రివేణి సంగమంలో పుణ్యస్నానాలు ఆచరిస్తున్న భక్తులు

### త్రివేణి సంగమం.. భక్తజన సందోహం

- ఎనిమిదో రోజు పోటెత్తిన భక్తులు
- వీఐపీ, ప్రత్యేక దర్శనాలు బంద్
- వన్‌వేతో ట్రాఫిక్ సమస్యకు చెక్
- వర్షంతో పుష్కర పరిసరాలు బురదమయం
- స్టోన్‌డస్ట్‌తో మరమ్మతు
- బురదతో పుష్కర ఘాట్ రోడ్‌లో ట్రాఫిక్ జామ్

# జన ప్రవాహం

జయశంకర్ భూపాలపల్లి, మే 22 (నమస్తే తెలంగాణ)/మహాదేవపూర్ : సరస్వతీ పుష్కరాల సందర్భంగా కాళేశ్వరంలోని త్రివేణి సంగమం గురువారం జనసంద్రంగా మారింది. ఎనిమిదో రోజు భక్తులు పోటెత్తారు. బుధవారం రాత్రి కురిసిన వర్షానికి పరిసరాలు బురదమయం కాగా భక్తులు ఇబ్బంది పడ్డారు. బస్టాండ్ నుంచి పుష్కరఘాట్ వరకు దారిలో పూర్తిగా బురద పేరుకుపోయి, అందులో లారీ చిక్కుకుపోయింది. దీంతో పుష్కరఘాట్ వరకు భక్తులను తీసుకొని వెళ్లే ఉచిత వాహనాలు ఎక్కడికక్కడే నిలిచిపోయాయి. ఎస్పీ కిరణ్ కరె, కలెక్టర్ రాహుల్ శర్మ ప్రత్యేక దృష్టి సారించి దారి వెంట స్టోన్‌డస్ట్‌తో మరమ్మతు చేయించి రాకపోకలను పునరుద్ధరించారు. కాళేశ్వర ముక్తీశ్వర ఆలయంలో వీఐపీ, ప్రత్యేక దర్శనాలు బంద్ చేసి రెండు క్యూ లైన్ల ద్వారా సమానంగా భక్తులను దర్శనానికి పంపారు. రద్దీ కారణంగా క్యూలో భక్తులు గంటల తరబడి వేచి ఉండాల్సి వచ్చింది. ఈ క్రమంలో పలువురు వృద్ధులు, చిన్నారులు సొమ్మసిల్లి పడిపోయారు. ఇదిలా ఉండగా కాళేశ్వరానికి వచ్చే వాహనాలకు వన్ వే చేయడంతో ట్రాఫిక్ సమస్యలు తగ్గాయి.



బురదలో నడుచుకుంటూ వెళ్తున్న భక్తులు

ఎస్పీ, కలెక్టర్ కమాండ్ కంట్రోల్ రూం నుంచి సీసీ కెమెరాల ద్వారా ట్రాఫిక్‌ను పర్యవేక్షిస్తూ అధికారులు సిబ్బందికి సూచనలు చేశారు. వర్షంతో విద్యుత్ సరఫరాకు అంతరాయం కలుగగా, ఎన్పీడీసీఎల్ ఎస్ఈ మల్హార్ ఆధ్వర్యంలో సిబ్బంది ఎప్పటికప్పుడు మరమ్మతు పనులు చేపట్టారు. పుష్కరాల ముగింపునకు నాలుగు రోజులు సమయం ఉన్నందున భక్తులు అధిక సంఖ్యలో తరలివచ్చే అవకాశం ఉండడంతో అధికార యంత్రాంగం ఏర్పాట్లలో నిమగ్నమైంది.

### ప్రముఖుల రాక

సరస్వతీ పుష్కరాలకు ప్రముఖుల తాకిడి కొనసాగుతూ ఉంది. గురువారం మంథని మాజీ ఎమ్మెల్యే పుట్ట మధు, ఎంపీ, బీజేపీ నేత ఈటల రాజేందర్, తెలంగాణ హస్తకళల అభివృద్ధి సంస్థ చైర్మన్ నాయుడు సత్యనారాయణ, సినీ నటుడు అల్లు అర్జున్ తల్లి నిర్మల, నిజామాబాద్ ఎమ్మెల్యే సత్యనారాయణ తదితరులు హాజరై పుణ్యస్నానాలు ఆచరించి ఆలయంలో ప్రత్యేక పూజలు చేశారు.

### సిగ్నల్స్ నిల్.. వ్యాపారాలు డల్

కాళేశ్వరంలో పుష్కరాల ప్రారంభం నుంచి సెల్ సిగ్నల్స్ సరిగ్గా లేక భక్తులు తీవ్ర ఇబ్బంది పడుతున్నారు. పుష్కరాలను నమ్ముకొని వ్యాపారాలు పెట్టుకున్న వ్యాపారులు యూపీఐ చెల్లింపులు జరగక ఆర్థికంగా నష్టపోతున్నారు. అధిక శాతం భక్తులు నగదు రహిత లావాదేవీల వైపే మొగ్గు చూపడంతో వ్యాపారాలు డల్‌గా సాగుతున్నాయి.

### ఈ నాలుగు రోజులే కీలకం

కాళేశ్వరం పుష్కరాలకు వచ్చే భక్తులకు ఎలాంటి ఇబ్బంది లేకుండా తగిన ఏర్పాటు చేసినట్లు రాష్ట్ర దేవాదాయ శాఖ ప్రిన్సిపల్ సెక్రటరీ శైలజారామయ్యర్ అన్నారు. గురువారం ఆమె కాళేశ్వరంలో ఏర్పాటు చేసిన సౌకర్యాలు, వసతులపై కలెక్టర్ రాహుల్ శర్మ, ఎస్పీ కిరణ్ ఖరేతో కలిసి క్షేత్రస్థాయిలో పరిశీలించారు. ఈ నాలుగు రోజులే కీలకమని భక్తులకు ఎలాంటి ఇబ్బందులు లేకుండా చూడాలని అధికారులను ఆదేశించారు.



స్వామి దర్శనానికి ఆలయంలో క్యూ కట్టిన భక్తులు



త్రివేణి సంగమంలో పుణ్యస్నానాలు ఆచరిస్తున్న పుట్ట మధు దంపతులు

## వాకీటాకీలతో కాంగ్రెస్ సైన్యం

### మాజీ ఎమ్మెల్యే పుట్ట మధు

సరస్వతీ పుష్కరాల్లో కాంగ్రెసోళ్లకు, ప్రైవేటు సైన్యానికి మంత్రి శ్రీధర్‌బాబు జోకర్ తమ్ముడు వాకీటాకీలు ఇచ్చి ప్రైవేటు దర్శనాలు చేయిస్తున్నాడని మంథని మాజీ ఎమ్మెల్యే పుట్ట మధు ఆరోపించారు. పుష్కరాల్లో విధులు నిర్వర్తిస్తున్న పారిశుద్ధ్య కార్మికుడు చనిపోతే ఇంతవరకు అతడి కుటుంబానికి మంత్రి శ్రీధర్‌బాబు రూపాయి ఇవ్వలేదని, ఎస్సీ, బీసీల చావులంటే ఇంత చులకనా అని ప్రశ్నించారు. కొరవడిన సౌకర్యాలు, పనిభారంతో కార్మికుడు శ్రీనివాస్ చనిపోయాడని, ఈ విషయంపై మంత్రి శ్రీధర్‌బాబు, దేవాదాయశాఖ ప్రిన్సిపల్ సెక్రటరీ శైలజారామయ్యర్‌పై ఎందుకు కేసు పెట్టరాదో చెప్పాలన్నారు. మృతుడి కుటుంబానికి రూ. 50లక్షల ఎక్స్‌గ్రేషియా ఇవ్వాలని డిమాండ్ చేశారు. దక్షిణకాశీగా పేరొందిన కాళేశ్వర క్షేత్రానికి ఎంతో చరిత్ర ఉందని, మంత్రి శ్రీధర్‌బాబు దంపతుల తీరుతో ఆలయ ప్రతిష్టకు చెడ్డపేరు వస్తున్నదన్నారు. ప్రొటోకాల్ ఉల్లంఘించి దళిత కులానికి చెందిన ఎంపీని అవమానపరిచారని, దేవాదాయశాఖ ప్రిన్సిపల్ సెక్రటరీ ఇందుకు బాధ్యత వహించాలని, ఈ విషయాన్ని తాము వదిలిపెట్టమన్నారు.



# విమానాశ్రయాలను తలపించేలా..

### రైల్వే ప్రయాణికులకు అన్ని వసతులు

- కేంద్ర సహాయ మంత్రి భూపతిరాజు శ్రీనివాస్ వర్మ
- వరంగల్ రైల్వేస్టేషన్‌ను వర్చువల్‌గా ప్రారంభించిన ప్రధాని మోదీ
- భూపతిరాజుతో పాటు రాష్ట్ర మంత్రి పొంగులేటి, మండలి డిప్యూటీ చైర్మన్ బండా ప్రకాశ్ హాజరు

ఖిలా వరంగల్, మే 22: ‘రైల్వే శాఖను అభివృద్ధి చేయాలనే దృఢ సంకల్పంతో నరేంద్ర మోడీ నాయకత్వంలో తెలంగాణలో 40 రైల్వే స్టేషన్లను నూతన హంగులతో పునరాభివృద్ధి పనులు జరుగుతున్నాయి. మొదటి విడతలో మూడు రైల్వే స్టేషన్లను చారిత్రక నేపథ్యంతో పాటు విమానాశ్రయాలను తలపించేలా ప్రయాణికులకు అన్ని మౌలిక వసతులు కల్పించాం’ అని కేంద్ర సహాయ మంత్రి భూపతిరాజు శ్రీనివాస్ వర్మ తెలిపారు. అమృత్ భారత్ స్టేషన్ పథకంలో వరంగల్ రైల్వే స్టేషన్‌ను ప్రధాని నరేంద్ర మోదీ వర్చువల్ పద్ధతిలో ప్రారంభించారు. రైల్వే స్టేషన్‌లో నిర్వహించిన కార్యక్రమానికి కేంద్ర సహాయ మంత్రి భూపతి రాజు శ్రీనివాస్ వర్మ, రాష్ట్ర మంత్రి పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డి, ఎంపీ డీకే అరుణ, ఎంపీలు డీకే అరుణ, ఈటల రాజేందర్, కడియం కావ్య, మండలి డిప్యూటీ చైర్మన్ బండా ప్రకాశ్, మేయర్ గుండు సుధారాణి, ఎమ్మెల్యేలు నాయిని రాజేందర్‌రెడ్డి, రేవూరి ప్రకాశ్‌రెడ్డి, కేఆర్ నాగరాజు, ఎమ్మెల్సీ బస్వరాజు సారయ్య హాజరయ్యారు. ఈ సందర్భంగా కేంద్ర సహాయ మంత్రి మాట్లాడుతూ రైల్వే స్టేషన్లలో అమృత్ భారత్ రైల్వే స్టేషన్ పథకం ద్వారా సామాన్యులందరికీ అన్ని సదుపాయాలు కల్పించేలా రైల్వే స్టేషన్ పునరుద్ధరించామన్నారు. భారతీయ రైల్వేలో సరికొత్త అధ్యాయానికి సాక్షిగా నేడు వరంగల్ రైల్వే స్టేషన్ నిలిచిందన్నారు. తెలంగాణ రాష్ట్రం రావడం సంతోషంగా ఉందని, ఇక్కడి సంస్కృతీసంప్రదాయాలు ఉట్టిపడేలా రైల్వే స్టేషన్‌ను అభివృద్ధి చేయడం అభినందనీయమన్నారు. అభివృద్ధి ఎవరు చేసినా పార్టీ, రాజకీయాలకతీతంగా స్వాగతించాలన్నారు. వరంగల్ ప్రజలకు మరోసారి రైల్వే స్టేషన్ ప్రారంభోత్సవ శుభాకాంక్షలు తెలిపారు. కార్యక్రమంలో కలెక్టర్ డాక్టర్ సత్యశారద, బల్దియా కమిషనర్ అశ్విని తానాజీ వాకడే, దక్షిణ మధ్య రైల్వే ఏడీజీఎం నీరజ్, ఏడీఎం గోపాల్, ఏసీఎం ఐఎస్ఆర్ మూర్తి తదితరులు పాల్గొన్నారు.

## పుష్కరాలకు వెళ్తూ.. ఆటో, కారు ఢీకొని ఇద్దరు మృతి



రజిత (ఫైల్)



విష్ణు(ఫైల్)

కాటారం, మే 22: భూపాలపల్లి-కాటారం 353(సీ) జాతీయ రహదారిపై గురువారం పుష్కరాలకు వెళ్తున్న ఆటో, కారు ఎదురెదురుగా ఢీకొనడంతో ఆటోలో ప్రయాణిస్తున్న ఇద్దరు అక్కడికక్కడే మృతి చెందగా, మరో ఆరుగురికి తీవ్ర గాయాలయ్యాయి. కాటారం ఎస్సై అభినవ్ తెలిపిన వివరాల ప్రకారం.. హైదరాబాద్‌కు చెందిన కొత్త చంద్రకాంత్, గుండ్ల శ్రీనివాస్, గుండ్ల సంతోషి, కాపర్తి రవీందర్, కాపర్తి జ్యోతి కారులో పుష్కరాలకు వచ్చి తిరిగి వెళ్తున్నారు. చిట్యాల మండలం వరికోలుపల్లి గ్రామం నుంచి ఆటోలో నర్సింహ, పాల రజిత(32), శ్రీరాముల విష్ణు(22), అజీద్, వివన్, సంధ్య, శోభ, మణెమ్మ, పిల్లలు శాన్విత, విశృత్, మోక్షిత్ పుష్కరాలకు కాళేశ్వరం వెళ్తున్నారు. జాతీయ రహదారిపై మేడిపల్లి టోల్‌గేట్ సమీపంలో కారు, ఆటో ఎదురెదురుగా ఢీకొన్నాయి. ప్రమాదంలో ఆటోలో ప్రయాణిస్తున్న విష్ణు(20), రజిత (32) అక్కడికక్కడే మృతి చెందారు. మరో ఇద్దరు తీవ్రంగా గాయపడగా, నలుగురు స్వల్ప గాయాలతో బయటపడ్డారు. క్షతగాత్రులను వాహనదారులు, స్థానికులు భూపాలపల్లి 100 పడకల ఆస్పత్రికి తరలించి చికిత్స చేయిస్తున్నారు. మెరుగైన చికిత్స కోసం వరంగల్‌కు తరలించారు. ఘటనా స్థలాన్ని సీఐ నాగార్జునరావు, ఎస్సైలు అభినవ్, గీతరాథోడ్ పరిశీలించి వివరాలు సేకరించి కేసు నమోదు చేశారు. మృతదేహాలను పోస్టుమార్టం నిమిత్తం 100 పడకల ఆస్పత్రికి తరలించారు.

## దర్శనానికి గంటల సమయం పడుతున్నది



కాళేశ్వర ముక్తీశ్వర క్షేత్రంలో భక్తుల రద్దీకి అనుగుణంగా ఏర్పాట్లు లేవు. స్వామి వారి దర్శనానికి గంటల కొద్దీ సమయం పడుతున్నది. క్యూలో నిలబడలేక చాలా ఇబ్బంది పడాల్సి వస్తున్నది. పోలీసులు, ఆలయ సిబ్బంది వీఐపీల దర్శనాల కోసం ఆరాటపడుతున్నారు.సామాన్య భక్తులను పట్టించుకోవడం లేదు. – చంద్రకళ, మంచిర్యాల